సాక్షి బాపట్ల

ఆదివారం ౹ 2 ౹ జూన్ ౹ 2024




కరపత్రాల ఆవిష్కరణ

వినుకొండ(నూజెండ్ల): పేరెంట్స్ అండ్ టీచర్స్ హోమ్ విజిట్‌లో భాగంగా నడిగడ్డలోని డాక్టర్ బోడేపూడి హనుమయ్య, సుప్రభాత్ జెడ్పీ హైస్కూలులో కరపత్రాలను ఆవిష్కరించారు.



బండ్లమ్మ సేవలో కమిషనర్

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో ఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 504.60 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో డీఎడ్ సెకండియర్ ఫలితాలు

గుంటూరు ఎడ్యుకేషన్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎడ్) ద్వితీయ సంవత్సర 2022–24 రెగ్యులర్, 2020–22, 2021–23 ప్రైవేటు బ్యాచ్‌లకు సంబంధించి గత జనవరిలో జరిగిన పరీక్షల ఫలితాలను ప్రభుత్వ పరీక్షల విభాగం ప్రకటించినట్లు డీఈఓ పి.శైలజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్కుల జాబితాను www. bse. ap. gov. in నుంచి పొందవచ్చని పేర్కొన్నారు. రీ–కౌంటింగ్ కోసం దరఖాస్తు చేసేందుకు ఈనెల 10వ తేదీలోపు ప్రతి సబ్జెక్టుకు రూ.500 చొప్పున నేరుగా ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్‌కు చెల్లించాలని సూచించారు.

పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలనకు 300 మంది హాజరు

నేడు 92,001 నుంచి 1,08,000 ర్యాంకు వరకు పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిసెట్–2024 కౌన్సెలింగ్‌లో భాగంగా నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ల పరిశీలనకు శనివారం 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. హెల్ప్‌లైన్ కేంద్ర సమన్వయకర్త టి.శేఖర్ పర్యవేక్షణలో వివిధ శాఖల అధికారులు పాల్గొని సర్టిఫికెట్లు పరిశీలించారు. కాగా ఆదివారం జరగనున్న సర్టిఫికెట్ల పరిశీలనకు 92,001 నుంచి 1,08,000 ర్యాంకు వరకు విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది.

భక్తిశ్రద్ధలతో హనుమత్ జయంతి



పొన్నూరు: పొన్నూరులో హనుమత్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామికి విశేష అభిషేకాలు, పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని సహస్ర లింగేశ్వర స్వామి, వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తెల్లవారుజామున విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచామృత అభిషేకం నిర్వహించారు. స్వామిని విశేషంగా అలంకరించారు. మధ్యాహ్నం లక్ష తమలపాకులు, మల్లెపూలతో పూజ, నివేదన, నీరాజనం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి సువర్చలా సమేత వీరాంజనేయ స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్లు రద్దు చేయడం జరిగిందని సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ శనివారం తెలిపారు. రైలు నంబర్ (07464) విజయవాడ–గుంటూరు, గుంటూరు–విజయవాడ(07465), గుంటూరు–విజయవాడ(07976), హుబ్లీ–విజయవాడ(17329), రైళ్లు ఈనెల 1వ తేదీ నుంచి జూలై 14 వరకు రద్దు చేయడం జరిగిందని తెలిపారు. విజయవాడ–హుబ్లీ(17330) రైలు ఈనెల 2వ తేదీ నుంచి జూలై 15వ తేదీ వరకు రద్దు చేయడం జరిగిందని తెలిపారు.

- అదే విధంగా న్యూ గుంటూరు స్టేషన్ నుంచి వెళ్లాల్సిన చెన్నై–విజయవాడ(12077), చెన్నై–కాట్రా(16031), చెన్నై–లక్నో జంక్షన్(16093) రైళ్లు ఈనెల 1వ తేదీ నుంచి జూలై 14 వరకు తెనాలి, దుగ్గిరాల, కృష్ణాకెనాల్ మీదుగా దారి మళ్లించడం జరిగిందని తెలిపారు. ప్రయాణికులు గమనించి సహకరించాలని సూచించారు.

ఏఎన్‌యూకు రెండు రోజులు సెలవులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి రెండు రోజులు సెలవులు ఇచ్చినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ తెలిపారు. విశ్వవిద్యాలయంలో 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ఉన్నందున వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆదేశాల మేరకు సెలవులు ఇచ్చామన్నారు. వర్సిటీలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ నెల 3, 4 (సోమ, మంగళ వారాలు) తేదీలలో సెలవులు కేటాయించినట్లు రిజిస్ట్రార్ తెలిపారు.

భక్తులతో కిక్కిరిసిన శింగరకొండ



లక్ష తమలపాకుల పూజలో ప్రసన్నాంజనేయస్వామి

- వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు
- దీక్ష విరమించిన స్వాములు

అద్దంకి రూరల్: జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రం శింగరకొండలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం భక్తులతో కిక్కిరిసింది. వేడుకల్లో భాగంగా స్వామివారికి అర్చకులు ఉదయం సుప్రభాతసేవ, బిందెతీర్థం నిర్వహించారు. అనంతరం పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మూలవిరాట్‌కు లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. యాగశాలలో మన్యుసూక్తహవనం, పూరాణహుతి, ద్రవ్యపూజ, మహా పూర్ణాహుతి, యాగశాల ప్రదక్షిణలు నిర్వహించారు. నియమనిష్టలతో 40 రోజులపాటు స్వామివారి మాలలు ధరించిన స్వాములు స్వామి వారి సమక్షంలో దీక్ష విరమించారు. సాయంత్రం 6.45 గంటలకు పదివేల మామిడి పండ్లతో పూజ నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు అర్చకులు, ఆలయ సిబ్బంది తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వచ్ఛంద సేవా సంస్థలు ఎండలకు భక్తుల దాహార్తి తీర్చేందుకు వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు.



దీక్ష విరమిస్తున్న స్వాములు

ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సిద్ధం

జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా

బాపట్ల: ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్ బాషా వెల్లడించారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలోని ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూములను జిల్లా ఎన్నికల అధికారి రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ కలిసి శనివారం పరిశీలించారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు చెందిన స్ట్రాంగ్ రూముల భద్రత, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. అధికారులు, పోటీలో ఉండే అభ్యర్థులు, వారి ఏజెంట్లు లోపలికి వెళ్లే మార్గాలకు సూచిక బోర్డులు స్పష్టంగా ఉండేలా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈసీఐ మార్గదర్శకాల మేరకు ఓట్ల లెక్కింపు కేంద్రాలు సంసిద్ధం చేశామని తెలిపారు. ఈనెల నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనున్నందున పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో 14 ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఉండగా, 12 కేంద్రాలలో ఈవీఎం యంత్రాలు, మిగిలిన రెండు కేంద్రాలలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తామన్నారు. అఫీషియల్ కమ్యూనికేషన్, పబ్లిక్ కమ్యూనికేషన్, మీడియా సెంటర్‌లను ఏర్పాటు చేశామన్నారు. కళాశాల ప్రవేశ ద్వారం నుంచి 100 మీటర్లలోపు వాహనాలకు అనుమతి లేనందున అందరూ నడిచి రావాల్సి ఉంటుందన్నారు. వాహనాలకు పార్కింగ్ జోన్ సిద్ధం చేశామన్నారు. బారికేడ్లు ఏర్పాటు వంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ డివైసులు లోపలికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు అధికారులు, సిబ్బంది ఉదయం 5 గంటలకు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, ఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.



పోలీసులకు సూచనలు ఇస్తున్న జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్

ఘర్షణలకు పాల్పడితే పోలీస్ పవర్ చూపిస్తాం

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
- కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు చర్యలు
- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



చీరాలఅర్బన్: ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పోలీసు పవర్ చూపిస్తామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. శనివారం చీరాల వచ్చిన ఆయన స్థానిక ఒన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ముందుగా చీరాల నియోజకవర్గ పరిధిలోని డీఎస్పీ, సీఐలతో ఆయన సమావేశమయ్యారు. కౌంటింగ్ రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. నియోజకవర్గంలోని సమస్యాత్మక ప్రాంతాలలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు బందోబస్తు ఏర్పాటుచేయాలన్నారు. పోలీసు పికెట్, పెట్రోలింగ్ నిరంతరం కొనసాగించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ జరిగేలా చూడాలని సీఐలకు సూచించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ప్రత్యేక భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. 5వ తేదీ వరకు సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. పెట్రోలింగ్ ద్వారా నిరంతరం గస్తీ జరుగుతుందన్నారు. చీరాల పట్టణంపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. రెండు డ్రోన్ కెమెరాలు సిద్ధం చేశామన్నారు. జూన్ మూడు నుంచి 5వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. రాజకీయపార్టీల కార్యాలయాలు, అభ్యర్థుల ఇళ్లు, కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్ తదితర ప్రాంతాల్లో ఎవరూ చేరవద్దన్నారు.

రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా..

చీరాల పట్టణంలో పాత నేరస్తులు, రౌడీషీటర్ల కదలికలు ఎక్కువగా ఉన్నాయని, వారిపై నిరంతర నిఘా ఉంచామన్నారు. మూడు రోజులు వారు బయటకు వస్తే అరెస్టు చేసి జైలుకు పంపిస్తామన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించాలని ప్రయత్నించే వారిపై తీసుకునే చర్యలు తీవ్రంగా ఉంటాయని, దాని పర్యవసానాలు జీవితాంతం వారు అనుభవించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల రోజు, ఆ తర్వాత జరిగిన ఘర్షణలలో పాల్గొన్న వారిపై రౌడీషీట్స్ తెరవడం జరిగిందని, మరలా ఏదైనా చట్ట వ్యతిరేక ఘర్షణలలో పాల్గొంటే వారిని జిల్లా బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పోలీసు సూచనలు పాటించాలని సూచించారు. చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్, సీఐలు పి.శేషగిరిరావు, బి.సోమశేఖర్, ఎస్.సత్యనారాయణ, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

పల్నాడు ప్రతిష్ట ఇనుమడింప చేసిన క్రీడాకారులు

- రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పల్నాడు క్రీడాకారుల ప్రతిభ
- పల్నాడు జిల్లాకు 11 బంగారు, 4 రజత, 3 బ్రాంజ్‌మెడల్స్
- పవర్ లిఫ్టింగ్ అంతర్జాతీయ క్రీడాకారుడు పసుపులేటి సురేష్



ప్రతిభ చూపిన క్రీడాకారులను అభినందిస్తున్న సురేష్

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా ప్రతిష్టను క్రీడాకారులు ఇనుమడింప చేశారని పల్నాడు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ, పవర్ లిఫ్టింగ్ అంతర్జాతీయ క్రీడాకారుడు పసుపులేటి సురేష్ అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంగళగిరి ఈద్గాలో గత నెల 29 నుంచి 31 వరకు మూడు రోజులపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్– బెంచ్ ప్రెస్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ మెన్, ఉమెన్ పోటీలు ప్రతిష్టాత్మకంగా జరిగాయి. పోటీలలో జిల్లాకు చెందిన 10 మంది క్రీడాకారులు 11 బంగారు, 4 రజత, మూడు బ్రాంజ్ పతకాలు మొత్తంగా 18 పతకాలను కై వసం చేసుకొని ప్రతిష్ట చాటారు.

పల్నాడు జిల్లా సీనియర్, జూనియర్ మెన్ టీమ్ చాంపియన్ షిప్ రెండవ స్థానం, పల్నాడు జిల్లా జూనియర్ ఉమెన్ టీమ్ చాంపియన్ షిప్ మూడో స్థానం, ఓవరాల్‌గా ఏపీ స్టేట్ టీమ్ చాంపియన్ షిప్‌లో మూడో స్థానం కైవసం చేసుకున్నారు. సత్తెనపల్లి మండలం వెన్నాదేవికి చెందిన ఎస్.శరత్ రాష్ట్రస్థాయిలో జూనియర్స్, సీనియర్స్ స్ట్రాంగ్ మెన్ టైటిల్ కైవసం చేసుకున్నాడు.

- జూనియర్ ఉమెన్ విభాగంకు సంబంధించి 53 కేజీల విభాగంలో రొంపిచర్లకు చెందిన ఎం.అనూష (రజత పతకం), 76 కేజీల విభాగంలో టీ.నాగజ్యోతి (గోల్డ్),
- జూనియర్, సీనియర్ మెన్ విభాగానికి సంబంధించి 66 కేజీల విభాగంలో వెన్నాదేవికి చెందిన ఎస్.శరత్ (రెండు బంగారు పతకాలు), 66 కేజీల విభాగంలో దాచేపల్లి, పెదగార్లపాడుకి చెందిన ఎం.అశోక్ కుమార్ (కాంస్య పతకం), 74 కిలోల విభాగంలో సత్తెనపల్లికి చెందిన పసుపులేటి వంశీకృష్ణ (రెండు బంగారు పతకాలు, రెండు రజిత పతకాలు), 120 కేజీల విభాగంలో గుడిపూడికి చెందిన లింగిశెట్టి శివనాగేశ్వరరావు (నాలుగు బంగారు పతకాలు) కైవసం చేసుకున్నారు.
- సబ్ జూనియర్ మెన్ బెంచ్ ప్రెస్ విభాగంలో 53 కేజీల విభాగంలో కె.కార్తీక్ (బ్రాంజ్ పతకం), 66 కేజీల విభాగంలో షేక్ మొహిద్దిన్ (బంగారు పతకం), సీనియర్ బెంచ్ ప్రెస్‌లో 66 కిలోల విభాగంలో సత్తెనపల్లికి చెందిన టీ.గోపీ (కాంస్యం పతకం), 83 కిలోల విభాగంలో సత్తెనపల్లికి చెందిన షేక్ నజీర్ (బంగారు పతకం), 83 కిలోల మాస్టర్స్–2 విభాగంలో క్రోసూరుకి చెందిన జె.జెమ్స్(రజత పతకం) కై వసం చేసుకున్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను పసుపులేటి సురేష్‌తోపాటు పల్నాడు జిల్లా పవర్ లిఫ్టింగ్ ప్రెసిడెంట్ జిమ్ రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు, కత్తి పవన్, పసుపులేటి అశోక్‌కుమార్, మాతంగి రాహూల్ గౌతమ్, జి.రమేష్, శాంతయ్య, సత్తెనపల్లి పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.

‘కౌంటింగ్’ నిబంధనలు కఠినం



నెహ్రూనగర్: ఓట్ల లెక్కింపు భద్రతా ఏర్పాట్లపై ఎన్నికల కమిషన్ ఇప్పటికే మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈసీ అనుమతి ఉన్నవారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోనికి అనుమతిస్తారు.

కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, ఈసీ అనుమతి ఉన్న వ్యక్తులు, పరిశీలకులు, ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుంది. అభ్యర్థులైతేనే మంత్రులకు కౌంటింగ్ హాలులోకి ప్రవేశం ఉంటుంది. కౌంటింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఎవరైనా ఏజెంట్ అనుచితంగా ప్రవర్తించినా, నిబంధనలు పాటించకపోయినా బయటకు పంపించే అధికారం రిటర్నింగ్ అధికారికి ఉంటుంది.

- కౌంటింగ్ హాలుకు వందమీటర్ల పరిధిలో మార్కింగ్ చేస్తారు. దీనిని పెడెస్ట్రియన్(పాదచారుల) జోన్ అంటారు. దీని చుట్టూ బారికేడ్లు నిర్మిస్తారు. ఒక ప్రవేశ ద్వారం ఉంటుంది. ఇక్కడ స్థానిక పోలీసులను నియమిస్తారు. కౌంటింగ్ హాలుకు వంద మీటర్ల అవతలే వాహనాలను నిలిపివేస్తారు.
- స్ట్రాంగ్ రూము నుంచి కౌంటింగ్ హాలు దూరంగా ఉన్నప్పుడు ఈవీఎంలు తీసుకుని వెళ్లడానికి అసౌకర్యంగా ఉంటుంది. అందువలన స్ట్రాంగ్ రూము డోర్ వద్ద నుంచి కౌంటింగ్ హాలు వరకూ ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేస్తారు.
- ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూము భవనాల ప్రవేశ ద్వారం నుంచి కౌంటింగ్ హాళ్ల వరకూ ఉన్న ప్రదేశాన్ని రెండో అంచెగా పరిగణిస్తారు. ఇక్కడ తగినంత మంది రాష్ట్ర సాయుధ పోలీసులు ఉంటారు.
- ఆడియో, వీడియో రికార్డు చేయగల మొబైల్ ఫోన్లు, ఐ ప్యాడ్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను లోపలకు అనుమతించరు.
- అలాగే అగ్గిపెట్టె, ఇంకు పెన్నులు, బ్లేడ్‌లు, చాకులు, పిన్నులు, ఆయుధాలను కూడా అనుమతించరు. పెన్సిల్, తెల్లకాగితాలు తీసుకుని వెళ్లవచ్చు.
- రెండో అంచెలో రాష్ట్ర పోలీసులు మాత్రమే తనిఖీలు చేస్తారు.
- కౌంటింగ్ ఏజెంట్లు, సిబ్బంది లోపలకు వెళ్లేందుకు ప్రత్యేక ప్రవేశం ఏర్పాటు చేస్తారు.
- కౌంటింగ్ హాలు బయట నిలబడి ఎవరూ ఫోన్లలో మాట్లాడకూడదు. మీడియా లేదా పబ్లిక్ కమ్యూనికేషన్ రూములో మాత్రమే ఫోన్లలో మాట్లాడుకోవచ్చు. ఫోన్లు డిపాజిట్ చేసే సౌకర్యం ఉంటుంది.
- కౌంటింగ్ కేంద్రం ద్వారం నుంచి మూడో అంచె భద్రత ప్రారంభమవుతుంది. ఇక్కడ సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఉంటారు. రిటర్నింగ్ అధికారి పిలిస్తే తప్ప వీరు కౌంటింగ్ హాలులోకి ప్రవేశించరాదు.
- ఏజెంట్లు తమకు కేటాయించిన టేబుల్ వద్ద మాత్రమే కూర్చోవాలి. కౌంటింగ్ హాల్ అంతా తిరిగేందుకు వారికి అనుమతి ఉండదు.

సత్తాచాటిన కొప్పురావూరు కోడెలు



చోళ్లవీడులో బండలాగుతున్న ఎడ్ల జతలు

రాచర్ల: మండలంలోని చోళ్లవీడులో వేమయ్య స్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి నాలుగు పండ్ల సైజు ఎడ్ల బండలాగుడు పోటీల్లో గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, కొప్పురావూరు గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు ఎడ్ల జతలు సత్తాచాటాయి. ఈ పోటీల్లో మొత్తం 17 జతలు ఎడ్లు పాల్గొనగా కొప్పురావూరు గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు ఎడ్ల జతలు నిర్ణీత 15 నిమిషాల్లో 5400 అడుగులు లాగి మొదటి బహుమతిని సాధించాయి. అదేవిధంగా సత్యసాయి జిల్లా, సీకే పల్లి మండలం, పులేంకపల్లె గ్రామానికి చెందిన బచ్చల భాస్కర్‌రెడ్డి ఎడ్లు 5277 అడుగులు లాగి రెండో బహుమతి సాధించగా, బాపట్ల జిల్లా, బల్లికురవ మండలం, గంగపాలెం గ్రామానికి చెందిన రాయి సుబ్బాయ్య ఎడ్ల జతలు 5100 అడుగులు లాగి మూడో బహుమతిని సాధించాయి. బేస్తవారిపేట మండలం, వంగపాడు గ్రామానికి చెందిన కైప వెంకటరామిరెడ్డి ఎడ్ల జతలు 5100 అడుగులు లాగి నాలుగో బహుమతి, అర్ధవీడు మండలం, నారాయణపల్లె గ్రామానికి చెందిన జంగాల రంగ దివ్యశ్రీ ఎడ్లు 4856 అడుగులు లాగి ఐదో బహుమతి పొందాయి. పల్నాడు జిల్లా, నూజెండ్ల మండలం, రెడ్డిపాలెం గ్రామానికి చెందిన జక్కిరెడ్డి సుబ్బారెడ్డి ఎడ్ల జతలు 4800 అడుగులు లాగి ఆరో బహుమతి, కొమరోలు మండలం, పామూరుపల్లె గ్రామానికి చెందిన కామూరి రమణారెడ్డి, గోపు రమణారెడ్డిల ఎడ్ల జతలు 4551 అడుగులు లాగి ఏడో బహుమతి సాధించాయి. తెలంగాణ రాష్ట్రానికి చెందిన రక్షితారెడ్డి ఎడ్ల జతలు 4301 అడుగులు లాగి ఎనిమిదో బహుమతిని సాధించాయి. గెలుపొందిన విజేతల యజమానులకు వరుసగా రూ. 40 వేలు, రూ.30, రూ.17,500, రూ. 17,500, రూ. 10, రూ. 8, రూ. 5, రూ. 4 వేలను అందజేశారు.

పవర్ లిఫ్టింగ్ ఓవరాల్ చాంపియన్ గుంటూరు

మంగళగిరి: పట్టణంలోని ఈద్గా షాదీఖానాలో మూడు రోజుల పాటు జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీలు శుక్రవారం రాత్రి ముగిశాయి. గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ జూనియర్, సబ్ జూనియర్, సీనియర్, మెన్, ఉమెన్, మాస్టర్ బ్రెంచ్‌ప్రెస్–2024 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీలలో గుంటూరు జిల్లా జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. అనంతరం జరిగిన బహుమతి ప్రదానం కార్యక్రమంలో డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరావు, షేక్ సంధానిలకు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ శాప్ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ ఎన్‌సీ మోహన్, నాగార్జున యూనివర్సిటీ ప్రిన్సిపాల్ పి.జాన్సన్, రోటరీ క్లబ్ ప్రతినిధుల అనిల్ చక్రవర్తి, అన్నే రత్న ప్రభాకర్, రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోషియేషన్ అధ్యక్షుడు మద్ది ప్రభాకర్, ప్రతినిధులు గంటా వెంకటేశ్వరరావు, పీవీ సంజీవ్, సకల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

300 లీటర్ల బెల్లంఊట ధ్వంసం



నగరం: నాటుసారా తయారుచేసినా, విక్రయించినా కఠినచర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ చెప్పారు. నగరం మండలంలో జిల్లేపల్లిలో శనివారం సెబ్ పోలీసులు నిర్వహించిన దాడులలో 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈసందర్భంగా సీఐ ప్రసాద్ మాట్లాడుతూ నాటుసారా తయారుచేస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లేపల్లిలోని మురుగుకాల్వ కట్ట అంచున సుమారు 300 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. నాటుసారా తయారుచేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. గ్రామాలలో ఎక్కడైనా నాటుసారా తయారుచేస్తుంటే సమాచారాన్ని సెబ్ పోలీసులకు తెలియజేయాలని కోరారు.

వ్యవసాయ విద్యతో అద్భుతాలు సృష్టించొచ్చు

ప్రిజం క్రాప్ సైన్స్ డైరెక్టర్ సీహెచ్‌పీవీ సాంబశివరావు



మాట్లాడుతున్న సీహెచ్‌పీవీ సాంబశివరావు

బాపట్ల: వ్యవసాయ విద్యను కేవలం ఉద్యోగ సముపార్జన కోసం మాత్రమేకాక వ్యవసాయ పారిశ్రామిక కేంద్రాలను స్థాపించే లక్ష్యంతో చదవాలని ప్రిజం క్రాప్ సైన్స్ డైరెక్టర్ సీహెచ్‌పీవీ సాంబశివరావు విద్యార్థులకు సూచించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల 79వ వార్షిక హాస్టల్ దినోత్సవంలో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ విద్య ద్వారా అద్భుతాలు సాధించవచ్చని, అన్నదాతకు దోహదపడే ఆధునిక టెక్నాలజీలను సృష్టించవచ్చన్నారు. అభివృద్ధి చెందిన దేశాలలోని వ్యవసాయ విద్యకంటే భారత దేశంలోని వ్యవసాయ విద్య ఉన్నత ప్రమాణాలతో ఉంటుందన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న జీఎస్టీ అడిషనల్ కమిషనర్ పి.రామ్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకొని చదవాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన డీన్ అఫ్ స్టూడెంట్ అఫైర్స్ డా.పి.సాంబశివరావు విద్యార్థులు తమ మానసిక శక్తిని పెంపొందించుకోవాలని సూచన చేయగా, రిజిస్ట్రార్ డా.కే.గురువారెడ్డి కళాశాలలో హాస్టల్ వసతులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తానన్నారు. అసోసియేట్ డీన్ డా. వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కళాశాలలో బాలికల కోసం అధునాతన వసతులతో నూతన వసతి గృహ నిర్మాణానికి రూ. 5.4 కోట్లు మంజూరయ్యాయన్నారు. తొలుత బాలుర హాస్టల్ వార్షిక నివేదికను హాస్టల్ వార్డెన్ డా. కె.చంద్రశేఖర్, బాలికల హాస్టల్ నివేదికను వార్డెన్ డా. వి.ప్రసన్నకుమారి సమర్పించారు. ప్రొఫెసర్ డా. ఎస్. ఆర్. కోటేశ్వరరావు, డా.పులిమోహన్‌రావులు పర్యవేక్షించారు.

విజయం సాధించిన ప్రకాశం జిల్లా జట్టు

నరసరావుపేటఈస్ట్: ఆంధ్ర సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల అండర్-19 బాలుర క్రికెట్ పోటీలలో భాగంగా శనివారం ప్రకాశం, పశ్చిమగోదావరి జిల్లా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ప్రకాశం జట్టు 107 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఏసీఏ, ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రకాశం జిల్లా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 302 పరుగులు చేసి ఆల్ అవుట్ అయింది. ప్రకాశం జట్టు బ్యాట్స్‌మెన్‌లు ఆనంద్ 92, గిరీష్ 69, అఖిల్ 51పరుగులు చేయగా పశ్చిమగోదావరి జిల్లా జట్టులోని యశ్వంత్ 4, హర్షవర్ధన్ మూడు వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన పశ్చిమగోదావరి జిల్లా జట్టు 195 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యారు. ప్రకాశం బౌలర్ మోహన్‌సాయి 5 వికెట్లు సాధించి గెలుపులో కీలక పాత్ర పోషించారు.

నిర్ణీత ప్రదేశాల్లోనే పార్కింగ్

- నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు
- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



పార్కింగ్ ప్రదేశాలను పరిశీలిస్తున్న ఎస్పీ

బాపట్లటౌన్: పార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు వారికి కేటాయించిన ప్రదేశాల్లో మాత్రమే వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ రోజు బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల వద్దకు వచ్చే వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు, ఉద్యోగులు వాహనాలను పార్కింగ్ చేయడానికి సిద్ధం చేసిన అనువైన పార్కింగ్ స్థలాలను శనివారం ఎస్పీ వకుల్‌జిందాల్ పరిశీలించారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల ప్రవేశ ద్వారానికి 100 మీటర్ల దూరంలో ఏర్పాటుచేసిన బ్యారికేడ్ల వద్ద అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ కేంద్రం వద్ద విధులు నిర్వహించడానికి వచ్చే ప్రభుత్వ ఉద్యోగులు వారి వాహనం నుంచి దిగి కౌంటింగ్ కేంద్రాలలోకి వెళ్లాలన్నారు.

పార్కింగ్ ఇలా..

- కౌంటింగ్ కేంద్రానికి వచ్చే అభ్యర్థులందరి వాహనాలను కమ్మ జనసేవ సమితి(కమ్మ కల్యాణమండపం) పక్కన, దాని ఎదురుగా ఉన్న రెండు ప్రదేశాల్లోనే పార్కింగ్ చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే అధికారులు, సిబ్బందికి (పోలీసు, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ అధికారులు) విలియంబూత్ కాలేజీ వద్ద పార్కింగ్ ప్రదేశం కేటాయించడం జరిగిందన్నారు.
- పర్చూరు, చీరాల, అద్దంకి వైపు నుంచి వచ్చే టీడీపీ, మిత్ర పక్షాల ఏజెంట్‌లకు, ఇండిపెండెంట్ ఏజెంట్లకు చీరాల రోడ్డులోని జాతీయరహదారి వై జంక్షన్ సమీపంలోని రాయల్ మెరైన్ వద్ద పార్కింగ్ కేటాయించామన్నారు.
- పర్చూరు, చీరాల, అద్దంకి వైపు నుంచి వచ్చే వైఎస్సార్ సీపీ ఏజెంట్లకు, ఇండిపెండెంట్ ఏజెంట్లకు వెదుళ్లపల్లి బ్రిడ్జి వద్ద గల బధిరుల పాఠశాలలో గల ప్రదేశంలో వాహనాలను పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు.
- పర్చూరు, చీరాల, అద్దంకి వైపు నుంచి వచ్చే కాంగ్రెస్ పార్టీ, మిత్ర పక్షాలకు, ఇండిపెండెంట్ ఏజెంట్లకు చీరాల రోడ్డులోని వై.జంక్షన్ సమీపంలోని రాయల్ మెరైన్ కంపెనీ ఎదురుగా గల ప్రదేశంలో వాహనాలను పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు.
- రేపల్లె, వేమూరు, బాపట్ల వైపు నుంచి వచ్చే టీడీపీ, మిత్ర పక్షాల ఏజెంట్లు, ఇండిపెండెంట్ ఏజెంట్లు బీఈసీ కాలేజీ వెనుక వైపున ఉన్న సుబ్బారెడ్డి పాలెం రోడ్డు వద్ద గల ప్రదేశంలో పార్కింగ్ చేసుకోవాలన్నారు.
- రేపల్లె, వేమూరు, బాపట్ల వైపు నుంచి వచ్చే వైఎస్సార్ సీపీ ఏజెంట్లు 216 జాతీయరహదారి పక్కనే ఉన్న నాగేంద్రపురం వెళ్లే రోడ్డు పక్కన గల ప్రదేశంలో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలన్నారు.
- రేపల్లె, వేమూరు, బాపట్ల వైపు నుంచి వచ్చే కాంగ్రెస్, మిత్రపక్షాలు, ఇండిపెండెంట్ ఏజెంట్లు బీఈసీ కళాశాల వెనుక వైపు సుబ్బారెడ్డిపాలెం రోడ్ పక్కన గల ప్రదేశంలో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలన్నారు.
- ద్విచక్ర వాహనాలపై వచ్చే అధికారులు, ఏజెంట్‌లు అందరూ బీఈసీ కళాశాల పక్కన 100 మీటర్ల పరిధి నుంచి 200 మీటర్ల వరకు ఉన్న రోడ్డు మార్జిన్‌లో పార్కింగ్ చేసుకోవాలన్నారు.
- రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించడానికి వచ్చే ఉద్యోగులు తప్ప ఇతరులు ఎవరినీ కౌంటింగ్ జరిగే కళాశాల పరిసరాలల్లోకి అనుమతించమన్నారు.
- ఎన్నికల కౌంటింగ్ రోజు కళాశాల చుట్టూ 2 కిలో మీటర్ల పరిధిని రెడ్ జోన్‌గా పరిగణించడంతో పాటు బాపట్ల పట్టణంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. బాపట్ల పట్టణంలో రెండు డ్రోన్లతో పూర్తి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.
- సాధారణ ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల కార్యకర్తలు వారి ఇంటివద్దనే ఉండి ప్రసారమాధ్యమాల ద్వారా ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను వీక్షించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లోకి రాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతోపాటు బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ, బాపట్ల రూరల్ సీఐ శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి



చీరాల రూరల్: రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చీరాలలో చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ సీహెచ్ కొండయ్య తెలిపిన వివరాల మేరకు.. స్థానిక కారంచేడు రైల్వేగేటు సమీపంలో వ్యక్తి మృతిచెందినట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. మృతుడి వయస్సు 30 సంవత్సరాలు ఉంటుందని, మృతుని వద్ద ఎటువంటి ఆచూకీ లభ్యం కాలేదని ఎస్ఐ చెప్పారు. పట్టాలు దాటుతున్న క్రమంలో విజయవాడ వైపు వెళ్లే రైలు ఢీకొని మృతిచెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు 94406 27646 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.